దేశాన్ని వదిలిపెట్టిపోయింది... పెళ్ళి చేసుకొని సుఖపడాల్సిన వయసులో పెళ్ళిపెటాకులు లేకుండా రాజ్యంగాని రాజ్యం పోయింది...'

"మల్లన్నా... పట్వారి పంతులు రికొస్తండు. ఆగవే..." ఉతనివెంటే నడుస్తూ అన్నాడు దుర్గయ్య.

మల్లయ్య నడక వేగం తగ్గించాడు.

" ఏమాగుడురా తమ్మి...? అయినె... సంగతి మనకు తెలువదా? ఇయ్యాల్ల నేను కొంచెం పచ్చుగున్ననని నా వెంబడి పడుతండు... తను నుంచి గున్నప్పుడు ఎంతమందిని గోసపుచ్చుకున్నడు...?"

"నువ్వన్నది నిజమేనె మల్లన్న...కాని, పంతులిప్పుడు చచ్చినపాము.. వీళ్ళ పట్వారీగిరీ లెప్పుడో పోయినయి... ఊళ్లల్ల లొల్లులైనంక ఈల్లంత తోకలు ముడిసింద్రు.. సరెగని పంతులెందుకు నీ ఎంబడి పడుతుండే... రొండు మూడు సార్లు నీగురించడిగిండు.." అన్నాడు దుర్గయ్య.

" ఏవున్నదేంది...? నేను మళ్ళీ మస్కూట్‌కు పోతె అయినె కొడుకును తీసుకపొమ్మంటడేమొ... ఇదు వరకు రెండు సార్లు సెప్పిండు... చాల రోజులైంది గద నేనొచ్చి... ఇగ పోతనని వెంబడిపడుతుండు... లేకుంటె ఆయనెకు నాతోనేంపని...?"

వాళ్ళు మాట్లాడుతూ నడుస్తున్నారు.

మాధవరావు వాళ్ళను చేరుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు.

"తీసుకపోతె తీసుకపో లేకుంటె లేదు కని ఏదో ఒకటి చెప్పలేవు పంతులుకు... అయ్యకు పుట్టిన నలుగురు పరమ భాగోతులన్నట్టుందయినె పిల్లల సంగతి... బిడ్డలనే మంగీత మియ్యలేదు... కొడుకులు గూడ ఆవారాగాల్లే అయింద్రు..."

" ఇగో... దుర్గన్నా! మునుపు పాపాల్జేత్తె తలుగుటానికి కొంతకాలం పట్టేది... తాతల్జేసిన పాపాలు మనుమలకు తలిగేటి యంటరు.. ఇప్పుడదంతేం లేదు... ఎప్పటి యప్పుడే తలుగుతున్నాయి... చేసిన పాపాలుట్టిగనే పోతయా...?"

ఇప్పుడు మాధవరావు వాళ్ళను చేరుకున్నాడు.

"అబ్బ నీ కడుపుల అంబలి వడ...! ఏమి నడకరా మల్లన్న నీది...? విమానంలా దూసుకపోవడ్తిడని...! ఆగుమంటె ఆగుత లేకపోతివి... ఎప్పుడు తిమ్మితంగ మాట్లాడుదామన్నా దొరుకకపోతివి.. ఓసారి తాళ్ళళ్ళకు పోతివి... ఇంకోసారి పొలం దిక్కు పోతివి... మరోసారి సోపతికాల్లతోనెటో పోతివి... ఇప్పుడేమొ మొత్తుకుంటున్నా ఊరుకబుచ్చుకోవడ్తిని... కొంచెం మాట్లాడుతె నీ ముల్లేం బోతంది బిడ్డ..." అన్నాడు.

గబగబా నడిసొచ్చిన అలసటతో రొప్పుతున్నాడు.

"పంతులూ! మీరు పెద్దలోకులు... మేం పేదోల్లం... మీరు నాతో నేం మాట్లాడుతరు? మల్ల మేం దొంగలమైతిమి...?" అన్నాడు మల్లయ్య నడుస్తూనే.

"చచ్చిన పామునెందుకు చంపుతవు మల్లన్నా? పాత విషయాలు మనసులో పెట్టుకోకు... ఆ కాలం పోయింది..." అన్నాడు వెంటనడుస్తూ.

దుర్గయ్య తన ఇల్లు రాగానే వెళ్ళిపోయాడు.

మల్లయ్య, మాధవరావు ఒకరి పక్క నొకరు నడుస్తున్నారు.

ఎంత మనసులోంచి తీసేద్దామన్నా, తను మరిచిపోదామని ప్రయత్నించినా 'దొంగోడా...

